DD9 వార్త
తెలుగు దినపత్రిక
మంగళవారం, సెప్టెంబర్ 16, 2025



# ఐటీడీఏ గిరిజన దర్బార్

- స్వయం ఉపాధే లక్ష్యంగా దరఖాస్తులు స్వీకరణ
- ఐటీడీఏ ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గిరిజనులకు అందేలా కృషి చేస్తాం
- ఐటీడీఏ పిఓ బి రాహుల్ ఐఏఎస్

3 లో

- అక్రమ నిర్మాణాలపై చర్యలు
- నిబంధనలు అతిక్రమిస్తే కూల్చివేతే
- కాప్రాలో అక్రమ కట్టడాలపై ఏసీపి వెల్లడి




# సీజ్!

## ఆల్రెడీ "నోటీస్" వారంలోగా "యాక్షన్"



కాప్రా సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అడ్డగోలుగా నిర్మించిన అక్రమ కట్టడాల వ్యవహారం వివాదాస్పదంగా మారుతుంది. అధికారుల కనుసన్నల్లోనే యథేచ్ఛగా సాగుతున్న ఈ అక్రమ దందా వ్యవహారంలో అవినీతి అధికారుల పాత్ర కూడా ఉందని ఆరోపణలు తీవ్రంగానే ఉన్నాయి. బహిరంగంగానే వివాదాస్పద కట్టడాలు నిర్మిస్తూ నిర్మాణదారులు బరితెగింపు ధోరణితో వ్యవహరిస్తున్న తీరుపై అనేక విమర్శలు వెళ్ళు వెల్లువుత్తుతుండగా ఈ మొత్తం అక్రమాల వెనక భారీగా ముడుపులు చేతులు మారాయనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. అటు కార్పొరేటర్లు ఇటు అవినీతి అధికారులు కుమ్మక్కై నిబంధనలు తప్పిన నిర్మాణదారుల నుండి లక్షల్లో ముడుపులు ముక్కు పిండి వసూలు చేసుకుంటూ అడ్డగోలు నిర్మాణాలను చూసి చూడనట్లుగా వదిలేస్తూ పోతున్నారు. కాగా ఇటీవల డిడి 9 వార్త దినపత్రికలో కాప్రా సర్కిల్ పరిధిలో అడ్డగోలుగా సాగుతున్న అక్రమ కట్టడాల వ్యవహారాన్ని వివరిస్తూ వరుస కథనాలు వెలువడ్డాయి. దీనిపై మున్సిపల్ అధికారులు ఒక్కొక్కరు ఒక్కోరకంగా స్పందించడం విశేషం

**డిడి 9వార్త, హైదరాబాద్**

2 లో




## కళాశాలలో టాయిలెట్ బ్లాక్స్ ప్రారంభం

- విద్యార్థుల సౌకర్యం కోసం ఐటీసీ సంస్థ ముందడుగు
- ఐటీసీ సేవలు మరువలేనివి
- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

5 లో

## సమగ్ర దర్యాప్తుతో నేర నియంత్రణ

- క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా బాధితులకు న్యాయం
- నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవు
- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం
- సాంకేతికత వినియోగించి నేరస్తులను పట్టుకుంటాం
- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

5 లో



## విద్యార్థుల సీడ్ బ్యాంక్ కృషి అభినందనీయం

- కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- విద్యార్థి దశ నుండే పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన పెంపొందించాలి



6 లో






- అక్రమ నిర్మాణాలపై చర్యలు
- నిబంధనలు అతిక్రమిస్తే కూల్చివేతే
- కాప్రాలో అక్రమ కట్టడాలపై ఏసీపి వెల్లడి

# సీజ్!

## ఆల్రెడీ "నోటీస్" వారంలోగా "యాక్షన్"

**కాప్రా సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అడ్డగోలుగా నిర్మించిన అక్రమ కట్టడాల వ్యవహారం వివాదాస్పదంగా మారుతుంది. అధికారుల కనుసన్నల్లోనే యథేచ్ఛగా సాగుతున్న ఈ అక్రమ దందా వ్యవహారంలో అవినీతి అధికారుల పాత్ర కూడా ఉందని ఆరోపణలు తీవ్రంగానే ఉన్నాయి. బహిరంగంగానే వివాదాస్పద కట్టడాలు నిర్మిస్తూ నిర్మాణదారులు బరితెగింపు ధోరణితో వ్యవహరిస్తున్న తీరుపై అనేక విమర్శలు వెళ్ళు వెల్లువుత్తుతుండగా ఈ మొత్తం అక్రమాల వెనక భారీగా ముడుపులు చేతులు మారాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అటు కార్పొరేటర్లు ఇటు అవినీతి అధికారులు కుమ్మక్కై నిబంధనలు తప్పిన నిర్మాణదారుల నుండి లక్షల్లో ముడుపులు ముక్కు పిండి వసూలు చేసుకుంటూ అడ్డగోలు నిర్మాణాలను చూసి చూడనట్లుగా వదిలేస్తూ పోతున్నారు. కాగా ఇటీవల డిడి 9 వార్త దినపత్రికలో కాప్రా సర్కిల్ పరిధిలో అడ్డగోలుగా సాగుతున్న అక్రమ కట్టడాల వ్యవహారాన్ని వివరిస్తూ వరుస కథనాలు వెలువడ్డాయి. దీనిపై మున్సిపల్ అధికారులు ఒక్కొక్కరు ఒక్కోరకంగా స్పందించడం విశేషం**





**డిడి 9వార్త హైదరాబాద్ :** కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమాలకు కొమ్ముకాస్తున్న అవినీతి మున్సిపల్ అధికారులు కార్పొరేటర్ల అక్రమ వసూళ్ల వ్యవహారంపై పెద్ద ఎత్తున దుమారమే లెగుస్తుంది. ఈ మేరకు ఈ అక్రమాలకు సంబంధించిన వ్యవహారాలపై అధికారులు వ్యవహరిస్తున్న తీరును డి డి 9 వార్త ప్రశ్నించింది. దీనికి సంబంధించి డిడి 9 వార్తా ప్రతినిధి ఏసిపి కృష్ణ మోహన్ ను వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులకు దూరంగా నిర్మించే కట్టడాలపై చర్యలు తప్పవు అన్నారు. ఇప్పటికే అలాంటి నిర్మాణాలకు సంబంధించి నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. వారం రోజుల్లోగా అక్రమ కట్టడాలను సీజ్ చేస్తామని పూర్తిస్థాయి పరిశీలన అనంతరం తదుపరి చర్యలు కూడా తీసుకుంటామని తెలిపారు. అయితే అక్రమ నిర్మాణదారుల వెనక ఆయా ప్రాంతాల కార్పొరేటర్ల హస్తం ఉన్నందున అధికారులు చర్యలు తీసుకునే సాహసం చేస్తారా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అయితే వారంలోగా అక్రమ నిర్మాణాలను సీజ్ చేస్తామని ఏసిపి స్పష్టత ఇచ్చిన నేపథ్యంలో ఆ చర్యలకు ఆయన వెనకడుగు వేస్తే అనేక అనుమానాలకు ఆస్కారం ఏర్పడుతుంది. అక్రమాలను గుర్తించి మరి నోటీసులు జారీ చేసిన అధికారులు తదుపరి చర్య లను వేగవంతం చేయాలని అభిప్రాయాలు సైతం వ్యక్తం అవుతున్నాయి. కాప్రా సర్కిల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పూర్తిస్థాయిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ దారులు వ్యవహరించడం అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా అంతస్తులపై అంతస్తులు నిర్మించడం జగమెరిగిన సత్యం. అయితే ఈ తతంగం అంతా సంబంధిత కార్పొరేటర్ల మద్దతుతోనే జరగడం లక్షల్లో మామూళ్లు చేతులు మారడం జరిగిందనేది వాస్తవిక పరిస్థితి. మామూళ్లు ఇచ్చామనే పేరుతో నిర్మాణదారులు సైతం బరితెగింపు ధోరణితో వ్యవహరించేశారు. అయితే ఏసిపి వారం రోజుల్లోగా అక్రమ నిర్మాణాలను సీజ్ చేస్తామంటూ చేసిన ప్రకటన నేపథ్యంలో నిర్మాణదారులంతా సొమ్ములు తీసుకున్న కార్పొరేటర్ లను నిలదీసే అవకాశం ఉంటుంది ఇదే జరిగితే కార్పొరేటర్ల అక్రమ తంతు పెద్ద చర్చని యాంశంగా మారక తప్పదు.




డీడీ 9 వార్తలో ప్రచురితమైన వరుస కథనాలు






# పంటలకు సరిపడ యూరియా ఇవ్వాలి

- **నర్సాపురం PACS వద్ద BRS పార్టీ ఆధ్వర్యంలో రైతుల ధర్నా"**

**దుమ్ముగూడెం, సెప్టెంబర్ 15 (డిడి 9 వార్త):**

మండలంలోని నర్సాపురం PACS యూరియా సరఫరా కేంద్రం వద్ద ఈరోజు రైతులు, BRS పార్టీ మండల మరియు జిల్లా నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పంటలకు అవసరమైన యూరియా ఎరువులు సరిపడా అందించకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రైతుకు టోకెన్ సిస్టం లేకుండా కనీసం రెండు బస్తాల యూరియా ఇవ్వాలని, రైతులను ఎండకు వానకు లైన్లలో నిలబెట్టే పరిస్థితులు ఆపాలని, యూరియా కేంద్రాల్లో తాగునీటి, టెంట్లు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



ధర్నాను ఉద్దేశించి BRS పార్టీ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ మాట్లాడుతూ - "మాజీ సీఎం కేసీఆర్ పాలనలో రైతులకు ఇంత దుస్థితి ఎప్పుడూ రాలేదు. ఆధార్ కార్డు ఉన్న రైతు యూరియా బస్తా కోసం పడిగాపులు కాసే పరిస్థితి ఇప్పుడు కనిపిస్తోంది. రైతుల సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించినట్లు కనిపిస్తోంది" అని విమర్శించారు. రైతులు తిరుగుబాటు మొదలెడితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కణితి రాముడు, మాజీ MPP రేసు లక్ష్మీ, PACS డైరెక్టర్లు బొల్లి వెంకట్రావు, కాలవ పూర్ణయ్య, పిసోడి వెంకటేష్, పార్టీ నియోజకవర్గ లీగల్ అడ్వైజర్ కొత్త మల్లేశ్వరావు, మాజీ ఉపాధ్యక్షులు తునికి కామేష్, దామెర్ల శ్రీనివాసరావు, యువజన నాయకులు రావులపల్లి పృథ్వి, వాగే కిట్టు, కుమ్మరికుంట సూర్య, తురుబాక మాజీ సర్పంచ్ బుక్యా చందు, కురసం భాస్కర్, గుండి రవి, కాటెబోయిన శ్రీను, గుండి ధర్మ తదితరులు పాల్గొన్నారు.







# బావిలో పడి వృద్ధురాలు మృతి

- **వెంకటాపురం శివారులో విషాద ఘటన**

**వెంకటాపురం (నూగురు), సెప్టెంబర్ 15 (డిడి9 వార్త):**

వెంకటాపురం శివారు బీసీ మర్రిగూడెం పంచాయతీ, నేలారు పేటపేటకు చెందిన సంఘం సమ్మక్క (93) అనే వృద్ధురాలు బావిలో పడి మృతి చెందిన దుర్ఘటన చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు అనుమానం వ్యక్తమవుతున్నది.

సోమవారం ఉదయం ఇంటి ముందు ఉన్న బావిలో ఆమె మృతదేహాన్ని స్థానికులు గుర్తించి బయటకు తీశారు. ఈ మేరకు వెంకటాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనపై పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.

# భద్రాచలం ప్రైవేట్ వైద్యశాలలో దారుణం

- **మద్యం మత్తులో మహిళపై ఎక్సరే నిపుణుడు అసభ్య ప్రవర్తన**
- **బాధితురాలి పిర్యాదు తో కేసు నమోదు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (డీడీ9 వార్త):**

భద్రాచలంలోని ఓ ప్రముఖ ప్రైవేట్ వైద్యశాలలో ఎక్సరే తీపించుకోడానికి వచ్చిన మహిళ పై ఆ వైద్యశాల ఎక్సరే నిపుణుడు మద్యం మత్తులో అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన చోటుచేసుకుంది

వివరాల్లోకి వెళ్తే ఒడిశాకు చెందిన ఓ మహిళ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం భద్రాచలం బస్టాండ్ వెనుక ఉన్న ప్రైవేట్ వైద్యశాలకు వచ్చింది. అక్కడ వైద్యులు పరీక్షించి ఎక్స్‌రే చేయించమని సూచించారు. ఈ క్రమంలో బాధితురాలు ఎక్స్‌రే ల్యాబ్‌లోకి వెళ్లగా, అక్కడ విధుల్లో ఉన్న ఎక్సరే నిపుణుడు మద్యం మత్తులో మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిసింది

తక్షణమే బాధితురాలు ఆసుపత్రి యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా, ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. సమాచారం అందుకున్న భద్రాచలం పట్టణ సీఐ నాగరాజు కేసు నమోదు చేసి నిందితున్ని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు .

ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యశాలకి వైద్యం కోసం వచ్చే మహిళలకు భద్రతే లేకపోతే ఎలా? మద్యం మత్తులో ఉద్యోగులను విధుల్లో ఉంచడం యాజమాన్యం నిర్లక్ష్యం" అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మహిళపై జరిగిన దారుణానికి ఆసుపత్రి యాజమాన్యం పూర్తిగా బాధ్యత వహించి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు



# ఐటీడీఏ గిరిజన దర్బార్: స్వయం ఉపాధే లక్ష్యంగా దరఖాస్తులు స్వీకరణ

- **ఐటీడీఏ ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గిరిజనులకు అందేలా కృషి చేస్తాం - ఐటీడీఏ పిఓ బి రాహుల్ ఐఏఎస్**

**భద్రాచలం సెప్టెంబర్ 15 (DD9 వార్త):**

ఉద్యోగాల కోసం కాకుండా, స్వయం ఉపాధి పథకాల ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవడానికి మాత్రమే గిరిజనులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ స్పష్టం చేశారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ గిరిజన గ్రామాల నుంచి వచ్చిన వారి నుండి అర్జీలు స్వీకరించారు.

అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ఐటీడీఏ ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. దర్బార్‌కు వచ్చిన అర్జీలలో పోడు భూముల పట్టాల ఆన్‌లైన్, పట్టాలలో పేర్ల మార్పు, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, కొత్త చేపల సొసైటీ ఏర్పాటు, స్వయం ఉపాధి శిక్షణలు, వ్యవసాయానికి సంబంధించి విద్యుత్, బోరు, మోటారు సౌకర్యాలు, గిరిజన గ్రామాలకు సౌర జల విద్యుత్ కనెక్షన్లు, దీర్ఘకాలిక వ్యాధులకు ఆర్థిక సహాయం, ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎం ఉద్యోగ భృతి, ఈఎంఆర్ఎస్ పాఠశాలల్లో సీట్లు వంటి అంశాలపై ఎక్కువ దరఖాస్తులు అందాయి.

ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ పథకాలు:

గిరిజనుల నుంచి స్వీకరించిన అన్ని దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అధికారి రాహుల్ తెలిపారు. ఈ దర్బార్‌లో చర్ల, ములకలపల్లి, అశ్వరావుపేట, బయ్యారం, ఇల్లందు, ఎంకూరు, దమ్మపేట మండలాలకు చెందిన గిరిజనులు తమ సమస్యలను విన్నవించుకున్నారు.

చర్ల మండలం మొగళ్ళపల్లి గ్రామానికి చెందిన సులోచన, ఇతర మహిళలు: కొత్త ఇసుక సొసైటీ ఏర్పాటు.

ములకలపల్లి మండలం పాత జెండాల పాడు గ్రామానికి చెందిన రమేష్: తమ పొలంలో సోలార్ కనెక్షన్ ఏర్పాటు.

అశ్వరావుపేట మండలం ఆజుబాక గ్రామానికి చెందిన రాజేశ్వరి: తమ భూ సమస్యల పరిష్కారం.

బయ్యారం మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన భూక్య రమేష్: తమ గ్రామంలో విద్యుత్ స్తంభాలు, కనెక్షన్లు.

ములకలపల్లి మండలం సకినాలవారిపల్లె గ్రామానికి చెందిన సాయి బద్రు: కమ్యూనిటీ హాల్ నిర్మాణం.

ఇల్లందు మండలం రాజీవ్ నగర్ గ్రామస్తులు: కాలనీలో మౌలిక వసతుల కల్పన. ఎంకూరు మండలం మునియా తండా గ్రామానికి చెందిన వీరన్న, గ్రామస్తులు: పోడు పట్టాల మంజూరు.

దమ్మపేట మండలం బాలాజీ గూడెం గ్రామానికి చెందిన శ్రీనివాస్: గురుకులం కళాశాలలో సీటు.

ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ సత్యానందం, ఏవో రాంబాబు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.








# శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ కొత్త ఈవో దామోదర్ మర్యాదపూర్వక భేటీ

- **అధికారులకు ప్రజా ప్రతినిధులకు సన్మానం**

**భద్రాచలం, సెప్టెంబర్ 15, ( డిడి9 వార్త ):**

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ నూతన కార్యనిర్వాహణాధికారి (ఈవో) కె. దామోదర్ సోమవారం తన పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలువురు ప్రముఖులను, ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాలతో సన్మానించి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, ఐటీడీఏ పీవో బి. రాహుల్, తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, అలాగే భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులను కలిశారు.

ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఈవో దామోదర్ ఈ సందర్భంగా తెలిపారు. భక్తుల సహకారం, అధికారుల మద్దతుతో ఆలయ కార్యకలాపాలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన హామీ ఇచ్చారు.





# చెక్కుల పంపిణీ

- **42 కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్**
- **భద్రాచలంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా అందజేత**

**భద్రాచలం, సెప్టెంబర్ 15 (డిడి9 వార్త):**

భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో, నియోజకవర్గంలోని చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాలకు చెందిన 42 కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేయబడ్డాయి.

అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసిన ఈ కుటుంబాలకు, మొత్తం రూ.12,40,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు స్వయంగా లబ్ధిదారుల చేతులకు అందజేశారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, ప్రజా పాలనలో దరఖాస్తు చేసిన కేవలం రెండు నెలల్లోనే చెక్కులు అందినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో 8 వ రోజుకు చేరినా టీం డ్రైవర్ల సమ్మె

- **ఆర్టీసీ టీం డ్రైవర్స్ సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్టీయూ , న్యూడెమోక్రసీ డిమాండ్**

**భద్రాచలం, సెప్టెంబర్ 15 (డిడి9 వార్త):**

గత ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్న భద్రాచలం డిపోలోని టీం డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (IFTU) మరియు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు.

భద్రాచలం డిపోలో పనిచేస్తున్న 84 మంది టీం డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్నా, డిపో మేనేజర్, రీజనల్ మేనేజర్ సమస్యలను పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు.

బస్టాండ్లోని విశ్రాంతి గదిలో సమ్మె చేస్తున్న టీం డ్రైవర్ల దీక్షకు ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి భద్రాచలం ఏరియా అధ్యక్షుడు వై.ఎస్.రెడ్డి అధ్యక్షత వహించారు.

గౌని నాగేశ్వరరావు, ముసలి సతీష్ మాట్లాడుతూ, టీం డ్రైవర్లు తమ సొంత ప్రయోజనాల కోసం లేదా జీతాల కోసం సమ్మె చేయడం లేదని, అదనపు శ్రమ, అదనపు ప్రయాణం, డబుల్ డ్రైవర్ల సమస్యలపై మాత్రమే పోరాటం చేస్తున్నారని అన్నారు. చిన్న సమస్యలను కూడా పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.

ఇదే రీజనల్ మేనేజర్ పరిధిలోని ఇతర డిపోలలో 613, 671 కిలోమీటర్లకు మూడు మాస్టర్‌లు ఇస్తుంటే, భద్రాచలం డిపోలో 628 కిలోమీటర్లకు రెండు రోజుల మాస్టర్ మాత్రమే ఇస్తున్నారని వారు పేర్కొన్నారు. అలాగే, ఖమ్మం నుంచి వైజాగ్ వెళ్లే బస్సుకు డబుల్ డ్రైవర్లను కేటాయిస్తున్నారని, కానీ భద్రాచలం నుంచి వైజాగ్ వెళ్లే డ్రైవర్‌కు సింగిల్ డ్రైవర్‌ను మాత్రమే ఇస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని ఆర్టీసీ యాజమాన్యం, రీజనల్ మేనేజర్ సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

అదనపు పని భారం వల్ల డ్రైవర్లు అనారోగ్యాల పాలవుతున్నారని, ఇప్పటికే ఎనిమిది మంది డ్రైవర్లు అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే, ఐఎఫ్టీయూ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ ఏరియా అధ్యక్షుడు వై.ఎస్.రెడ్డి, ఉపాధ్యక్షులు బర్ల రామకృష్ణ, నాయకులు సత్యనారాయణ, కేశ రవి, దేగల శంకర్ మరియు టీం డ్రైవర్లు పాల్గొన్నారు.








# భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త టాయిలెట్ బ్లాక్స్ ప్రారంభం

- **విద్యార్థుల సౌకర్యం కోసం ఐటీసీ సంస్థ ముందడుగు**
- **ఐటీసీ సేవలు మరువలేనివి - ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**

**భద్రాచలం సెప్టెంబర్ 15 (డిడి9 వార్త):**

విద్యార్థుల సౌకర్యాలను విస్తరించే దిశగా భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో ఐటీసీ సంస్థ సహకారంతో నిర్మించిన గర్ల్స్ టాయిలెట్, బాయ్స్ టాయిలెట్ బ్లాకులను సోమవారం ప్రారంభించారు.

ప్రారంభ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. జాన్ మిల్టన్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి. రాహుల్, ITC HR జనరల్ మేనేజర్ పి. శ్యామ్ కిరణ్, ITC డీజీఎం డి. చెంగళ్ రావు, ఐటీసీ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు డాక్టర్ వి. కామేశ్వరరావు, వెంకటరెడ్డి, బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, విద్యార్థులు చదువు ద్వారా జీవితాలను మెరుగుపరచుకోవచ్చని, సమాజంలో మార్పు తీసుకురావడం విద్య ద్వారానే సాధ్యమని పేర్కొన్నారు. ఐటీడీఏ పీవో బి. రాహుల్ మాట్లాడుతూ విద్యార్థుల చదువుల అభివృద్ధికి ఐటీడీఏ ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని హామీ ఇచ్చారు. ITC ప్రతినిధి పి. శ్యామ్ కిరణ్ మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యాల కోసం అవసరమైన మౌలిక వసతుల కల్పనలో సంస్థ ఎల్లప్పుడూ బాధ్యతగా వ్యవహరిస్తుందని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె. జాన్ మిల్టన్ మాట్లాడుతూ, విద్యార్థుల కోసం ఈ సదుపాయాల నిర్మాణానికి ముందడుగు వేసిన ఐటీసీ సంస్థకు, సహకరించిన డీజీఎం చంగళ్ రావు, కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, పూర్వ విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

# పెన్షన్ పెంపు పై ఎమ్మార్పీఎస్ నిరసన

- **ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు సీనియర్ నాయకులు మచ్చా రాజా**

**చర్ల, సెప్టెంబర్ 15 (డిడి 9 వార్త)**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు పెన్షన్ ఆరు వేలకు పెంచాలనీ, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులతో పాటు ఇతర పెన్షన్ దారులకు నాలుగు వేలకు పెన్షన్ పెంచాలంటూ ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకులు మచ్చా రాజా మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం చర్ల మండల తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం తహసిల్దార్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఆ తరువాత ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్ మంజూరు చేయాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ వికలాంగులు, వృద్ధులు వితంతువులతో పాటు ఇతర పెన్షన్ దారులకు ఏ మాత్రం సరిపోవడం లేదని దీని వల్ల వాళ్ళు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని ప్రస్తుత పెన్షన్ నెల రోజుల పాటు సరిపోని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం చేయూత పెన్షన్లు పెంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, వృద్ధులు, వికలాంగులు పాల్గొన్నారు.








# సమగ్ర దర్యాప్తుతో నేర నియంత్రణకు కృషి చేయాలి: ఎస్పీ రోహిత్ రాజు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం సెప్టెంబర్ 15 (డిడి9 వార్త):**

ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టి, నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సోమవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**నాణ్యమైన దర్యాప్తుకు ప్రాధాన్యత:**

"క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్" ద్వారా బాధితులకు న్యాయం అందించాలని ఎస్పీ అన్నారు. కేసుల విచారణలో జాప్యం సహించేది లేదని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలు నిరంతరం రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

**అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం:**

గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లాలోని హాట్ స్పాట్‌స్‌ను గుర్తించి, గంజాయి రవాణా చేసే వారితో పాటు, దానిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని సూచించారు.

**- సాంకేతికత వినియోగం:**

సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. సైబర్ నేరాల్లో డబ్బులు కోల్పోయిన బాధితులు ఫిర్యాదు చేయగానే వెంటనే స్పందించి, వారికి అండగా ఉండాలని కోరారు. అలాగే, సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించి, నివాస ప్రాంతాలు, వ్యాపార సముదాయాల్లో వాటిని ఏర్పాటు చేసుకునేలా చూడాలని చెప్పారు. ప్రాపర్టీ కేసుల్లో సాంకేతికతను ఉపయోగించి, నేరస్తులను పట్టుకుని, సొత్తును రికవరీ చేసి బాధితులకు త్వరితగతిన అందేలా చూడాలని సూచించారు.

**రహదారి భద్రత:**

జిల్లాలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, వాటి నివారణకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని పట్టుకోవడానికి నిరంతరం వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఇల్లందు డీఎస్పీ చంద్ర భాను, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం, వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు.

# విద్యార్థుల సీడ్ బ్యాంక్ కృషి అభినందనీయం

- **కలెక్టర్ జితేష్ వి. పాటిల్**
- **విద్యార్థి దశ నుండే పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన పెంపొందించాలి.**

**అశ్వాపురం, సెప్టెంబర్ 15 (డీడి9 వార్త):**

విద్యార్థి దశ నుండే విత్తనాల సేకరణ కార్యక్రమం ద్వారా పర్యావరణంపై అవగాహన పెరుగుతుందని, ఈ విధమైన చర్యలు భవిష్యత్ తరాలకు పచ్చని వారసత్వాన్ని అందించడంలో కీలకమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు.

అశ్వాపురం మండలం నెల్లిపాక బంజర గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీ ఎస్) విద్యార్థులు చేపట్టిన సీడ్ బ్యాంక్ కార్యక్రమంలో జిల్లా స్థాయిలో మొదటి బహుమతిని సాధించడం గర్వకారణమని ఆయన అభినందించారు. సోమవారం పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులు సేకరించిన 362 రకాల విత్తనాలు, 440 కిలోల విత్తనాలను పరిశీలించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ –**

"విత్తనాల సేకరణ కేవలం పోటీ కాదు, పర్యావరణ పరిరక్షణకు పునాది. ప్రతి విత్తనం ఒక జీవనాధారం. అది ఔషధ విలువలు, ఆహార భద్రత, జీవవైవిధ్యాన్ని కాపాడుతుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు చూపిన కృషి ప్రశంసనీయం," అని అన్నారు.

పాఠశాలలో ఒక నర్సరీ ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కల పెంపకాన్ని చేపట్టాలని, పాఠశాల ప్రాంగణంలో సీడ్ గిఫ్ట్ బాక్స్ ఏర్పాటు చేసి సమాజంలో విత్తనాల మార్పిడి, పంపిణీకి అవకాశం కల్పించాలని కలెక్టర్ సూచించారు.

జిల్లా స్థాయి సీడ్ బ్యాంక్ పోటీలో విజయం సాధించిన ఈ పాఠశాలకు రూ. 50,000/ నగదు బహుమతితో పాటు అదనంగా జిల్లా నిధులు కేటాయించి విద్యార్థులను ప్రోత్సహిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఈ సందర్శనలో అదనపు కలెక్టర్ విద్యా చందన, ఎంఈఓ వీరాస్వామి, ప్రధానోపాధ్యాయురాలు విమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు







# మీకోసం మేమున్నాం

**చర్ల, కొత్తపల్లి గ్రామం, సెప్టెంబర్ 15 (డిడి 9 వార్త)**

చర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గంట జగన్ (40) కార్పెంటర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు, అతనికి అకస్మాత్తుగా కడుపు నొప్పి రావడంతో ఖమ్మం ఆసుపత్రికి తీసుకుని వెళ్లడంతో సర్జరీ చేయాల్సిందిగా వైద్యులు చెప్పడం జరిగింది ఈ పరిస్థితుల్లో ఆర్థిక భరోసా కోసం మీకోసం మేమున్నాం టీం ను ఆశ్రయించడంతో ఫండ్ రైజింగ్ పోస్టు పెట్టి సేకరించిన పది వేల రూపాయల నగదును సంస్థ సభ్యులు ఇర్ప అనసూయ (టీచర్ )చేతుల మీదుగా ఈరోజు ఉదయం చర్ల లోని మేమున్నాం కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ పేదవారు కష్టాల్లో ఉన్నప్పుడు మనమంతా తలా ఓ చేయి వేసి సహాయమందిస్తే వారు అవలీలగా గట్టెక్కుతారని, ఏ ఆసరా దొరకని వారే ఈ విధమైన సహాయం కోరతారని, దీనిని అర్థం చేసుకొని ప్రతి ఒక్కరూ కూడా తమ బాధ్యతగా భావించి ముందుకు వచ్చి మరింతగా ధాతృత్వాన్ని చాటుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ తెలిపారు ఈ కార్యక్రమంలో దొడ్డి తాతారావు, మట్టపల్లి సంతోష్ యాదవ్, దొడ్డ ప్రభుదాస్, మండలోజు సత్యనారాయణ, దొడ్డి సూరిబాబు, రామ్మోహన్, గాదెరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# హామీ ఇచ్చిన చేయూత పెన్షన్ పెంచేదెప్పుడు....?

- **తాసిల్దార్ కు వినతిపత్రం అందించిన పెన్షన్ దారులు**

**డిడి9 వార్త ఏటూరునాగారం/కన్నాయి-గూడెం :**

సోమవారం రోజున తహసిల్దార్ కార్యాలయం వీహెచ్పీఎస్ చేయూత పెన్షన్ దారుల హక్కుల పోరాట సమితి. కన్నాయి గూడెం తహసిల్దార్ కు వినతిపత్రం అందించిన వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల ఆర్గనైజింగ్ కన్వీనర్ ఆలం జంపయ్య ఆదివాసీ,ఎమ్మార్పీఎస్ వికలాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పెన్షన్ దారుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగన్న ఆదేశాల మేరకు ఈనెల 15 సోమవారం రోజున వికలాంగుల కు 6000/చేయుత పెన్షన్ దారుల పెన్షన్4000/ హెచ్చింపు నూతన పెన్షన్లు దారులకు పెన్షన్ 4000/ మంజూరు చేయాలని డిమాండ్ పై తహసిల్దార్ కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేసిన పెన్షన్ దారులను చైతన్యవంతం చేయుటకు మండలంలో అన్ని గ్రామాల నుండి వికలాంగుల హక్కుల పోరాట సమితి ఎమ్మార్పీఎస్ మండల నాయకులు చిట్యాల నరేష్ మాదిగ ఆధ్వర్యంలో ముట్టడి కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల ఆర్గనైజింగ్ కన్వీనర్ ఆలం జంపయ్య ఆదివాసీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని రకాల వికలాంగులు వృద్ధులు వితంతువులు నూతనంగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ పై తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడి చేయడం జరిగింది వికలాంగులు, వృద్ధులు వితంతువుల ఆత్మబంధువు పద్మశ్రీ మంద కృష్ణమాదిగన్న కార్యాచరణ విజయవంతం గ్రామాలలో చైతన్య సభలు, ప్రచారం చేయడం తోపాటు ఈనెల 20 న ప్రతి గ్రామపంచాయతీ కార్యదర్శి వికలాంగుల హక్కుల పోరాట సమితి చేయూత పెన్షన్దారుల హక్కుల పోరాట సమితి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో పెన్షన్ ధారులు నూతన పెన్షన్ మంజూరు కోసం దరఖాస్తు పెట్టుకున్న దరఖాస్తుదారుల తో పెద్ద ఎత్తున గ్రామపంచాయతీ కార్యాలయం ముట్టడి చేయాలని పిలుపునివ్వడం జరిగింది.కార్యక్రమంలో పెన్షన్ దారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

